RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## తాడిపత్రి స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి రాక

### ఉద్రిక్తతో పోలీసులు అప్రమత్తం

అనంతపురం,జూలై 20: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి చేరుకోవడంతో శనివారం తెల్లవారుజామున నియోజకవర్గంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఉదయం పెద్దారెడ్డి తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. టీడీపీ నేత సూర్యమునిపై దాడి, పోలింగ్ సందర్భంగా జరిగిన ఘర్షణలో అరెస్ట్ అయిన కేతిరెడ్డి పెద్దారెడ్డికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ష్యూరిటీలు సమర్పించేందుకు అనంతపురం నుంచి తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే వెళ్లాల్సి ఉంది. దీంతో ఈరోజు తెల్లవారుజామున పెద్దారెడ్డి నేరుగా తాడిపత్రి పీఎస్‌కు వెళ్లారు. పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లడంతో పోలీసులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. పోలింగ్ రోజు చెలరేగిన అల్లర్లతో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గత రెండు నెలలు నియోజకవర్గం వదిలి బయటే ఉన్నారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే పంచె ఊడదీసి కొడతామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేతిరెడ్డి తాడిపత్రి చేరుకుని పోలీస్‌స్టేషన్‌లో షూరిటీలు సమర్పించడంతో కొద్దిపాటి టెన్షన్ నెలకొంది.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక : 79 ఆదివారం 21-07-2024 పేజీలు :04 వెల:రూ.2.00


# ఏపీలో కుండపోత వర్షాలు..



### ఎపిలో ఎడతెరిపి లేకుండా వర్షం
### ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల
### పలు జిల్లాల్లో ప్రత్యక్ష చర్యల్లో కలెక్టర్లు

అమరావతి,జూలై20: గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ఏపీలోని పలు జిల్లాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తాయి. విశాఖ జిల్లాలో భారీ వర్షాల కారణంగా విద్యాసంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. అనకాపల్లి జిల్లాలో కల్యాణపులోవ జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. జలాశయం రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తాండవ జలాశయం ప్రస్తుత నీటిమట్టం 365 అడుగులుగా ఉంది. మరోవైపు తాడిగిరి వంతెన పైనుంచి వరద ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. దీంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షానికి అనకాపల్లి జిల్లాలో వరినాట్లు కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. సహాయ చర్యలకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలోని విద్యా సంస్థలన్నింటికీ సెలవు ప్రకటించారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రామరాజుపాలెం వద్ద వంతెనపై వరద ప్రవహిస్తోంది. దీంతో కేడీపేట-చింతపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.రాజవొమ్మంగి మండలం ఎర్రంపాడు వద్ద వరద ఉధృతి పెరిగింది. మరోవైపు వట్టిగెడ్డ జలాశయం పొర్లుకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. చింతూరు-కుయుగురు మధ్య వంతెన పై నుంచి వాగు ప్రవహిస్తుండటంతో..ఏపీ, ఒడిశా మధ్య రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రకాశం బ్యారేజ్‌కు భారీగా వరద పోటెత్తింది. బ్యారేజ్ నుంచి కాల్వల ద్వారా 3 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వర్షాల కారణంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. పులిచింతల ప్రాజెక్టుకు క్రమంగా వరద పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం వంద అడుగులకు చేరుకుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు వరి పంట నీటిలోనే నానుతోంది. కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 12 వేల హెక్టార్లకుపైగా వరి నాట్లు నీటమునిగాయి. రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. ధవళేశ్వరం కాటన్ ఆనకట్ట వద్ద 7.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాల్వలకు 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సముద్రంలోకి 3 లక్షల 9 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని గండి పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. అమ్మవారి ఆలయం గోపురం వరకు వరద నీరు చేరింది. అమ్మవారి ఆలయం వద్ద ఇళ్లు పూర్తిగా నీట మునిగాయి. వరద పెరుగుతున్న నేపథ్యంలో అమ్మవారి దర్శనాలు పూర్తిగా నిలిపివేశారు. ఆ ఆలయం నుంచి పాపికొండల విహారయాత్ర నిలిచి పోయింది.

# కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం కృషి చేయాలి : ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి,జూలై20: ఏపీ అభివృద్ధే ప్రధాన అజెండాగా పోటీపడి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 22 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. మంత్రుల నుంచి వివిధ శాఖలకు చెందిన సమాచారం తీసుకుని కేంద్రంతో సంప్రదింపులు జరపాలని సీఎం బాబు సూచించారు. అవసరాన్ని బట్టి రాష్ట్ర మంత్రులను వెంటబెట్టుకుని ఆయా శాఖలకు చెందిన కేంద్ర మంత్రులను కలవాలని ఆదేశించారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు రావాల్సిన నిధులపై భేటీలో చర్చించారు. దిల్లీలో జగన్ ధర్నా చేయనున్నారన్న అంశం భేటీలో ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. జగన్, అతని పార్టీ గురించి ఆలోచన చేయాల్సిన అవసరం లేదని పలువురు ఎంపీలు అన్నట్టు తెలుస్తోంది. జగన్ గురించి ఒక్క క్షణం ఆలోచించే సమయాన్ని కూడా రాష్ట్రాభివృద్ధి కోసం వెచ్చించాలని ఓ మంత్రి అన్నట్టు తెలిసింది. దిల్లీలో జగనేం చేస్తారో ముఖ్యం కాదని, మనమేం చేయాలనేదే ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖల నుంచి తెచ్చుకోవాల్సిన నిధులు, వివిధ కేంద్ర పథకాల ద్వారా మరింత ప్రయోజనం పొందేందుకు చేయాల్సిన కృషిపై సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ సాయం వంటి అంశాలపై విస్తృత సమన్వయంపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కోసం ఒక్కో ఎంపీకి ఇప్పటికే కొన్ని శాఖలు చొప్పున బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. నేటి సమావేశంలో మంత్రులను కూడా ఎంపీలకు సీఎం జతచేయనున్నారు. పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. జలజీవన్ మిషన్, క్రిషి సించాయీ యోజన కింద మెరుగైన సాయంపై మాట్లాడారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో వివిధ ప్రాజెక్టులకు భూముల కేటాయింపునకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై చర్చించారు. విశాఖ స్టీల్‌ఎ÷-లాంట్‌ను మళ్లీ గాడిన పెట్టేందుకు చేపట్టాల్సిన చర్యలు, విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ సంస్థలకు అవసరమైన పూర్తి సదుపాయాలు కల్పించడం తదితర అంశాలపై చంద్రబాబు కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు.


## తిరుమలలో భక్తులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు : టీటీడీ ఈవో

తిరుమల : తిరుమల లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులందరికీ మెరుగైన సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని టీటీడీ ఈవో శ్యామలారావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు ప్రక్షాళన చర్యలు తీసుకుంటున్నామని శనివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈవోగా బాధ్యతలు చేపట్టిన తరువాత నెలరోజుల్లో టీటీడీలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి లోపాలను గుర్తించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ టిక్కెట్ల జారీ వ్యవస్థలో కూడా చాలా లోపాలు గుర్తించామన్నారు. త్వరలోనే ఆన్‌లైన్ టికెటింగ్ వ్యవస్థలో పూర్తి పారదర్శకత ఉండేలా మార్పులు చేస్తామన్నారు. భక్తుల సమస్యలను మానిటరింగ్ చేసేందుకు ఓ వ్యవస్థ లేకపోవడాన్ని గుర్తించామని వివరించారు. క్యూ లైన్ల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఓ అధికారిని నియమించానన్నారు.నిపుణుల సూచనలతో అన్నప్రసాదాల నాణ్యతను కూడా పెంచామని పేర్కొన్నారు. అన్నప్రసాద సముదాయంలో నిత్యం రెండు లక్షల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నామని చెప్పారు. నెయ్యిలో నాణ్యత లేకపోవడం వల్లే లడ్డూ నాణ్యత తగ్గిందని గుర్తించామని తెలిపారు.



## ధారవి రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ టెండర్‌ను రద్దు చేస్తాం: ఉద్ధవ్ థాకరే

ముంబై: మహారాష్ట్రలో తమ పార్టీ అధికారంలోకి వస్తే పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి చెందిన ధారవి స్లమ్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ టెండర్‌ను రద్దు చేస్తామని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే శనివారం తెలిపారు. విలేకరుల సమావేశంలో థాకరే మాట్లాడుతూ, ధారవి నివాసితులు, వ్యాపారాలు దెబ్బతినకుండా తమ పార్టీ కాపాడుతుందని, అక్కడ నివసించే ప్రజలకు 500 చదరపు అడుగుల ఇళ్లు ఇస్తుందని అన్నారు.మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ధారవి స్లమ్ రీడెవలప్‌మెంట్ టెండర్‌ను రద్దు చేస్తాం? అదేదో ఇప్పుడే ఎందుకు రద్దు చేయకూడదో ప్రభుత్వం చెప్పాలి. ఎట్టి పరిస్థితిలోనూ ముంబైని 'అదానీ నగరం'గా మార్చేందుకు అనుమతించబోమని మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే అన్నారు.ప్రతి ఇంటికి ఒక నంబర్ ఇస్తున్నారు, ప్రభుత్వం ధారవి నివాసితులను అర్హులు, అనర్హుల ఉచ్చులో పడేయాలని చూస్తోంది, ఆపై వారిని తరిమికొట్టాలనుకుంటోందని థాకరే అన్నారు. వేలం తర్వాత నవంబర్ 2022లో అదానీ ప్రాపర్టీస్‌కు టెండర్‌ను కేటాయించారు, ఇందులో రియల్టీ మేజర్ డిఎల్ఎఫ్ , నమన్ డెవలపర్లు కూడా పాల్గొన్నారు.



# రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రత

### ప్రజల్లో ఆగ్రహానికి దారితీసేలా అరాచక పాలన
### పార్లమెంటులో అరచాకాలపై గళమెత్తండి
### రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేయండి
### ఎంపిల సమావేశంలో వైఎస్ జగన్ సూచన





అమరావతి,జూలై20: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో తీవ్ర వైఫల్యం జరిగిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్‌సీపీని అణగదొక్కడం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సాధ్యం కాదని, పైగా ఈ అరాచక పాలన ప్రజల్లో ఆగ్రహానికి దారి తీస్తుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై ఎంపీలకు వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో హత్యలు, దాడు లు, ఇతర హింసాత్మక ఘటనలపై పార్లమెంటులో గళమెత్తాలని పార్టీ ఎంపీలకు సూచించారు. రాష్ట్రపతి పాలనకు డిమండ్ చేయాలని ఎంపీలకు జగన్ సూచించారు. చంద్రబాబుకు గట్టిగా హెచ్చరికల పంపాలని తెలిపారు. పోరాటం చేయకపోతే దారుణాలకు అడ్డుకట్ట పడదన్నారు. రేపు అసెంబ్లీ సమావేశాల్లో నిరసన తెలుపుతామన్నారు. బుధవారం నాడు ఢిల్లీలో నిరసన తెలుపుతా మన్నారు. ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమం త్రుల అపాయింట్‌మెంట్లను కోరానని. .. అధికారంలో ఉన్న పార్టీ, అధికారంలో లేని పార్టీమీద దాడులు చేయడం అనేది ధర్మమా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభు త్వం తీవ్ర వైఫల్యం చెందిందని.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దారుణంగా దాడులు జరుగుతున్నాయన్నారు. వినుకొండలో జరిగిన హత్యా ఘటన పరాకాష్ట. వీడియో దృశ్యాలు చూస్తే.. ఈ రాష్ట్రంలో పరిస్థితులు ఎలా జరుగుతున్నాయి. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డుమీద కత్తితో జరిగిన దాడి అత్యంత అమానుషం. అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఒక మెసేజ్ పంపడానికి చేసిన ప్రయత్నం ఇది. రషీద్ వైన్‌షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. జరిగిన ఘటనను వక్రీకరించడానికి ఎల్లోమీడియా సహాయంతో ప్రభుత్వం నానా ప్రయత్నాలు చేస్తోంది. ఏదో బైక్ కాల్చిన ఘటనకు, జరిగిన దారుణహత్యకు ముడిపెట్టే ప్రయత్నంచేస్తున్నారు. కాలిన బైక్.. వైఎస్సార్‌సీపీ వాళ్లది, దీనికి సంబంధించిన కేసు కూడా నమోదయ్యింది. దాన్ని ట్విస్ట్ చేసి నానా తప్పుడు రాతలు రాస్తున్నారు.' అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల మీద దారుణంగా దాడులు జరగుతున్నాయన్నారు. వినుకొండలో జరిగిన హత్యా ఘటన పరాకాష్ట అన్నారు. వీడియో దృశ్యాలు చూస్తే ఈ రాష్ట్రంలో పరిస్థితులు ఎలా జరుగుతున్నాయో తెలుస్తుందన్నారు. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డుమీద కత్తితో జరిగిన దాడి అత్యంత అమానుషమన్నారు. రాజకీయ ప్రత్యర్థులకు, వైయస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఒక మెసేజ్ పంపడానికి చేసిన ప్రయత్నం ఇది అంటూ మాజీ సీఎం విరుచుకు పడ్డారు. జరిగిన ఘటనను వక్రీకరించడానికి ప్రభుత్వం నానా ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ఇప్పటి వరకు 36 మంది రాజకీయ హత్యలకు గురయ్యారన్నారు. వేయికిపైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయన్నారు. తన సొంత పార్లమెంటు నియోజకవర్గంలో, తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలో ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడులు చేశారన్నారు. టీడీపీ మనుషులను అక్కడ కావాలని ఉంచేలా పోలీసులతో ఎ÷-లాన్‌చేసి దాడులు చేశారని అన్నారు. మాజీ ఎంపీ రెడ్డప్ప, న్యాయవాది అయిన రెడ్డప్ప ఇంటికి వెళ్తే దాడులు చేశారన్నారు. తప్పులు వారు చేసి తిరిగి వైసీపీ వాళ్లమీద కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ప్రజాస్వామ్యానికి విలువ ఏముంటుందన్నారు. ఢిల్లీలో ధర్నా, నిరసన కార్యక్రమానికి సంబంధించి ఒక్కో ఎంపీకి, ఒక్కో బాధ్యత అప్పగించాలని జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. గత ఎన్నికల్లో మనం 86శాతం సీట్లను గెలిచామన్నారు. వైయస్సార్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు... ఓటు వేయని వారికి కూడా ఇంటింటికీ వెళ్లి పథకాలు ఇచ్చామన్నారు. ప్రజలిచ్చిన వాగ్దానాల అమలు కాకపోవడంపై ఎవ్వరూ ప్రశ్నించకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఎక్కడ కార్యకర్తలకు నష్టం జరిగినా వెంటనే స్పందించడం, వారిని కాపాడుకోవడం బాధ్యత అని చెప్పుకొచ్చారు.

## వైఎస్ జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు తీరని నష్టం: కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

అమరావతి : ఐదేండ్ల వైఎస్ జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు తీరని నష్టం జరిగిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆరోపించారు. ఆయన పాలనలో అవతవకలు జరిగినట్టు కేంద్రం కూడా వెల్లడించిందని పేర్కొన్నారు. టీడీపీ ఎంపీల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకుంటుందని వివరించారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ జరగదని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో మూడు శ్వేత పత్రాలు విడుదల చేయనున్నారని చెప్పారు. కేంద్ర నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని, కేంద్ర పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వకపోవడంతో కేంద్ర పథకాలు ఆగాయని ఆరోపించారు .కేంద్రం నుంచి నిధులు తెచ్చే బాధ్యత తమపై ఉందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో శనివారం టీడీపీ పార్లమెంటరీ స్థాయి సమావేశంలో బడ్జెట్ అంశంపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని వెల్లడించారు. ఢిల్లీ వేదికగానే జగన్ దుష్ప్రచారాన్ని తిప్పి కొడతామని తెలిపారు.



## జగన్ శవ రాజకీయాలు మానుకో

### జనసేన నేత నాగబాబు హితవు

అమరావతి,జూలై20: రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు జనసేన నేత కొణిదల నాగబాబు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. శనివారం నాడు జగన్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ వీడియో విడుదల చేశారు. జగన్ శవ రాజకీయాలు మానుకో అని హితవుపలికారు. రషీద్ హత్యకు రాజకీయాలతో సంబంధం లేదన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో అతను హత్య చేయబడ్డాడని తెలిపారు. ఈ హత్యను జనసేన పక్షాన తాము ఖండిస్తున్నామన్నారు. జగన్ పాలనలో ఎన్నో దారుణాలు చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వ లోపాలను ప్రశ్నిస్తే కొట్టారని... ప్రతిపక్ష నేతల గొంతెత్తితే కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయకులైన ప్రాణాలను బలి తీసుకున్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలపై పెట్టిన కేసులకు హద్దే లేదన్నారు. పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఐపీఎస్‌లను వైసీపీ నాయకులుగా మార్చి పని చేయించారని వ్యాఖ్యలు చేశారు.మీ దందాలకు అమాయకులైన అధికారులు బలి అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలు నోరెత్తాలంటే భయపడి పోయారన్నారు. మీరు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారని అంటూ ఎద్దేవా చేశారు. వ్యక్తుల మధ్య గొడవతో జరిగిన హత్యను రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారన్నారు. 'ప్రజలు మీకు బుద్ధి చెప్పినా... ఇంకా మీ బుద్ధి మార్చుకోవడం లేదని అంటూ నాగబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# సంపాదకీయం

ఆదివారం 21-07-2024

## మూడోతరం నేతలు.....

తమిళనాడులో దివంగత నేత ఎం కరుణానిధి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన అనంతరం వారసుడు ఎవరు అన్నదీ పెద్ద ఎత్తున చర్చ నడిచింది. చర్చ అనడం కన్నా అదో పెద్ద వివాదం అని చెప్పొచ్చు..! అప్పటికే డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్న స్టాలిన్, తన వారసుడు అంటూ కరుణానిధి స్వయంగా ప్రకటించారు. పెద్ద కుమారుడైన అలగిరి కరుణానిధి వారసత్వం కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కరుణానిధి సీఎంగా ఉన్నప్పుడే వారసుడిగా తన అనంతరం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వ్యూహాత్మకంగా 2009 లోక్‌సభ ఎన్నికల అనంతరం డిప్యూటీ సీఎంగా స్టాలిన్‌ను ఎంపిక చేశారు.కరుణానిధి ఆరోగ్యం కూడా పూర్తిగా సహకరించకపోవడం అటు పార్టీ ఇటు ప్రభుత్వం రెండు విధాలుగా చేదోడు వాదోడుగా ఉంటాడన్న వ్యూహంతో ఆ రోజు కరుణానిధి ఆ నిర్ణయం తీసుకున్నారు. కరుణానిధి మరణానంతరం స్టాలిన్‌కు పార్టీ పగ్గాలు చేజిక్కించుకునేందుకు సీఎం అయ్యేందుకు ఆ రోజు కరుణానిధి నిర్ణయం ఎంతగానో దోహదపడింది. ప్రస్తుతం స్టాలిన్ కూడా అదే ఆలోచనతో తన కుమారుడు ఉదయినిధి స్టాలిన్‌కు వారసత్వం అందాలన్న వ్యూహంతో ముందుకు వెళుతున్నట్టు తెలుస్తోంది.ఇప్పటికే ఉదయనిధికి మంత్రివర్గంలో చోటు కల్పించిన స్టాలిన్, ఏకంగా డిప్యూటీ సీఎం చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. ప్రస్తుతం సీఎంగా ఉన్న స్టాలిన్ ఆరోగ్యపరంగా కూడా చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించాలంటే మంత్రిగా కంటే ఉపముఖ్యమంత్రిగా ఉండడం మంచిదన్న ఆలోచనతో స్టాలిన్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోందిఅలాగే 2026 లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు కూడా డీఎంకేకు ప్రతిష్టాత్మకం రానున్నాయి. తమిళనాడులో డీఎంకే ఏఐడీఎంకే ప్రధాన పార్టీలుగా ఉండగా వచ్చే ఎన్నికల్లో ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన పార్టీ కూడా బరిలో ఉండబోతోంది. దాంతో పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే స్టాలిన్ తోపాటు తన అనుకున్న ముఖ్యమైన వారు పార్టీ బాధ్యతలను షేర్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. 2009లో లోక్‌సభ ఎన్నికలు పూర్తైన వెంటనే అప్పట్లో ఎమ్‌కే స్టాలిన్ డిప్యుటీ సీఎం అయ్యారు. ఆ తరవాత సీఎం అయ్యారు. ఇదే సెంటిమెంట్‌ని ఫాలో అవుతూ ఇప్పుడు ఉదయనిధి స్టాలిన్‌ని డిప్యుటీ సీఎం కుర్చీలో కూర్చోబెట్టనున్నారు.చెపాక్ తిరువల్లికెని నియోజకవర్గం నుంచి ఓంగా గెలుపొందిన ఉదయనిధి స్టాలిన్ 2022 డిసెంబర్‌లో కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిజానికి ఇప్పటికే ఆయనకు ఈ పదవి దక్కాల్సింది. కానీ కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వల్ల పొలిటికల్‌గా కాస్త ఇబ్బందులు ఎదురయ్యాయి. అలాంటి సమయంలో పదవి ఇస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న ఉద్దేశంతో హైకమాండ్ ఆ నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఇప్పుడు అంతా క్లియర్ కావడం వల్ల ఉప ముఖ్యమంత్రిని చేయాలని పట్టుదలతో ఉన్నారు ఎమ్‌కే స్టాలిన్. ఈ ఏడాది జనవరిలో ఉదయ నిధి స్టాలిన్ పెద్ద వివాదంలో ఇరుక్కున్నారు. సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మం డెంగీ, మలేరియా లాంటిదని అలాంటి వ్యాధుల్ని అంతం చేయాలని నోరు జారారు. కులం పేరుతో వివక్ష ఎందుకని ప్రశ్నిస్తూ ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ కామెంట్స్ సంచలనం సృష్టించాయి. ఈ వివాదం కోర్టుల వరకూ వెళ్లింది. ఉదయనిధి స్టాలిన్‌ని కోర్టులు మందలించాయి కూడా. సుప్రీంకోర్టు కూడా కలగజేసుకోవాల్సి వచ్చింది. ఇదంతా సద్దుమణిగింది అనుకునేలోగా ప్రభుత్వానికి మరో షాక్ తగిలింది. కల్లకురిచ్చి జిల్లాలో కల్తీ మద్యం కలకలం రేపింది. కల్తీ మద్యం సేవించి దాదాపు 65 మంది ప్రాణాలు కోల్పోయారు.లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ఈ ఘటన జరగడం ప్రభుత్వానికి సవాల్ విసిరింది. అప్పటికప్పుడు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ రావాల్సిన చెడ్డ పేరు వచ్చింది. అయితే...ఉదయనిధి స్టాలిన్‌ని డిప్యుటీ సీఎం చేసే విషయంలో ఎమ్‌కే స్టాలిన్‌దే తుది నిర్ణయమని పార్టీలోని కీలక నేతలు స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ నిత్యం విమర్శలు గుప్పిస్తుంటారు ఉదయనిధి స్టాలిన్. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా ప్రచారం చేశారు. పార్టీ మెజార్టీ సీట్లు గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించారు. మదురైలో ఎయిమ్స్ ప్రాజెక్ట్ ఇస్తామని చెప్పి కేంద్రం మోసం చేసిందంటూ చేసిన ప్రచారం బాగానే కలిసొచ్చింది. ప్రస్తుతానికి పార్టీని ముందుండి నడిపించే సత్తా ఉదయనిధికి ఉందని సీఎం భావిస్తున్నారుఅందుకోసమే వీలైనంత త్వరగా డిప్యూటీ సీఎం చేయడం, ఇటు పార్టీకి ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలకు సులువుగా ఉంటుందని స్టాలిన్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.మరోవైపు గతంలో తండ్రి కరుణానిధి సీఎంగా ఉన్నప్పుడే డిప్యూటీ సీఎం అయ్యాక పార్టీలో స్టాలిన్ మంచి పట్టు సాధించగలిగారు. ఇప్పుడు తన కుమారుడు ఉదయినిధి స్టాలిన్‌కు కూడా అదే ఫార్ములా ఉపయోగపడుతుందని గట్టిగా భావిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ విషయం అధికారికంగా ప్రకటన రానప్పటికీ డీఎంకేలో కీలక నేతల ద్వారా అందిన సమాచారం మేరకు వీలైనంత త్వరగా స్టాలిన్ తన నిర్ణయాన్ని అమలు చేయనున్నట్టు తెలుస్తోంది.

# గురువు ఏ విద్య నేర్పినా పూజ్యనీయుడే

-నేడు గురు పౌర్ణమి (వ్యాస పౌర్ణమి)



సనాతన భారతీయ సంప్రదాయంలో గురువుకు విశేషమైన స్థానం ఉంది. అంతటి ఖ్యాతి గలిగిన గురువును పూజించడానికి విశిష్టమైన రోజును మన పెద్దలు ఎప్పుడో నిర్ణయించారు. అదే గురు పౌర్ణమి. ఆషాఢ శుద్ధపౌర్ణమిని 'గురు పౌర్ణమి' లేదా 'వ్యాస పౌర్ణమి' అని అంటారు. ఇదే రోజు వ్యాస ముహాముని జన్మతిథి కావున మహాపర్వదినంగా అనాది కాలం నుంచీ భావిస్తున్నారు. ఈ రోజున గురుభగవానుడిని, వ్యాస మహర్షి, దత్తాత్రేయున్ని, సాయిబాబాను పూజించేవారికి అష్టైశ్వర్యాలు చేకూరుతాయి. 'గురుర్బ్రహ్మ గురుర్విష్ణుర్ గురుర్దేవో మహేశ్వర :గురుసాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీ గురువే నమ :' గురుపూజకు శ్రేష్టమైన గురు పౌర్ణమి విశిష్ఠత ఏమిటో తెలుసా? పూర్వం వారణాశిలో కడుపేద బ్రాహ్మణ దంపతులు ఉండేవారట.ఆ బ్రాహ్మణుని పేరు వేదనిధి. ఆయన సతీమణి పేరు వేదవతి. వీరిరువురు ఎల్లప్పుడూ చక్కని ఆధ్యాత్మిక చింతనతో భక్తి జ్ఞానము కలిగి జీవించేవారు. ఇంకా సంతాన భాగ్యము కోసం ఎన్ని నోములు నోచినా, ఎన్ని వ్రతాలు చేసినా ఫలితం లేకపోయింది.ఒకనాడు వేదనిధికి ప్రతిరోజూ మధ్యాహ్న సమయమందు వ్యాసభగవానులు రహస్యంగా గంగానదికి స్నానానికై వస్తూ ఉంటారని తెలుస్తుంది. ఎలాగైనా సరే వ్యాసమహర్షి దర్శనం పొందాలని ప్రతిరోజు వేయికళ్ళతో వెతక నారంభిస్తాడు. ఈ క్రమంలో ఒకరోజు ఒక భిక్షువు రూపం ధరించి దండధరుడైన వ్యక్తిని వేదనిధి దర్శిస్తాడు.వెంటనే వేదనిధి వారి పాదాలను ఆశ్రయిస్తాడు. దానికి ఆ భిక్షువు చీదరించుకుని కసురుకుంటాడు. అయినా సరే పట్టిన పాదాలను మాత్రము విడువకుండా మహానుభావా తమరు సాక్షాత్తు వ్యాసభగవానులని నేను గ్రహించాను. అందుచేతనే మిమ్మల్ని శరణు పొందగోరుచున్నాను అంటాడు.ఆ మాటలు విన్న ఆ భిక్షువు గంగానది ఒడ్డువైపునకు నలుదిశలా బిత్తరి చూపులు చూస్తూ, ఇంకా తనను ఎవరైనా చూస్తున్నారేమోనని తలచి వెంటనే వేదనిధిని ఆప్యాయంగా చేరదీసి, ఏమి కావాలో కోరుకోమంటారు.ఈ క్రమంలో రేపు నా తండ్రిగారి పితృకార్యము. దానికి తమరు బ్రాహ్మణార్థమై భోజనానికి మా ఇంటికి తప్పక దయచేయాలని వేడుకుంటాడు. అందుకు ఆ మహర్షి వేదనిధి ఆహ్వానాన్ని అంగీకరిస్తాడు. అనంతరం ఎంతోసంతోషంగా ఇంటికి చేరుకున్న వేదనిధి తన సతీమణికి గంగానదీతీరాన జరిగిన వృత్తాంతమంతా వివరిస్తాడు. మరుసటిరోజు ఉదయమే ఇచ్చిన మాటప్రకారం వారిగృహానికి విచ్చేసిన వ్యాస మహర్షిని ఆ దంపతులు సాదరంగా లోనికి ఆహ్వానించి అతిథి సత్కారము చేసి పూజిస్తారు. అనంతరం దేవతార్చనకు తులసీదళాలు, పువ్వులను సిద్ధం చేస్తారు.వారి పూజ అనంతరం ఎంతోశుచిగా వంటకాలను సిద్ధపరిచి శ్రాద్ధవిధులను విధి విధానంగా నిర్వహిస్తారు. అనంతరం ఆ దంపతులు ఆ వ్యాస భగవానునికి సాష్టాంగ నమస్కారం చేస్తారు. వారి ఆతిథ్యానికి ఎంతో సంతుష్ఠులైన ఆ ముని శ్రేష్ఠుడు.. ఓ పుణ్య దంపతులారా.. మీకు ఏమి వరం కావాలో కోరుకోండి అని అంటాడు.ఎన్ని నోములు, వ్రతాలు చేసినా సంతానభాగ్యము మాత్రము మాకు కలుగలేదు. అని బదులు పలుకుతారు. అందుకు త్వరలోనే మీకు తేజోవంతులు, ఐశ్వర్యవంతులు అయిన పదిమంది పుత్రసంతతి కలుగుతుందని ఆశీర్వదిస్తాడు. ఈ క్రమంలో వేదనిధి, వేదవతి దంపతులు వ్యాసముని అనుగ్రహంతో సుఖసంతోషాలు, అంత్యమున విష్ణుసాయుజ్యాన్ని పొందగలిగారు. హిందూ పురాణాల ప్రకారం.. సత్యవతి, బ్రాహ్మణ ఋషి పరాశరులకు జన్మించిన వేద వ్యాసుడు, ఏడుగురు అమరులలో ఒకరని, ఇప్పటికే గ్రహాలపై సంచరిస్తున్నాడని నమ్ముతారు. కాబట్టి వ్యాస పూర్ణిమ రోజున ఆ మహామునిని ప్రార్థిస్తే ఆయన అనుగ్రహము పొందిన వారము అవుతాము.

## ప్రభుత్వ యంత్రాంగాల ఉదాసీనత

### ప్రమాదంలో ప్రజారోగ్యం

వర్షాకాలం వచ్చిందంటే... దోమలు వణుకు పుట్టిస్తాయని, పారిశుద్ధ్య లేమికి తోడు, ప్రభుత్వ యంత్రాంగాల ఉదాసీనత కారణంగా దోమల సంతతి ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోందన్నారు. దాని నివారణకు గట్టి చర్యలు చేపడితేనే ప్రమాదం తప్పుతుందని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది రాజలింగు మోతే అన్నారు. శనివారం రామకృష్ణాపూర్ పట్టణంలో ఏర్పాటుచేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జూన్ సెప్టెంబర్ మధ్య కాలంలో ఆసుపత్రులు ఎక్కువగా జ్వర పీడితులతో కిక్కిరిసిపోతాయన్నారు. వారిలో చాలామంది పేదలు మధ్యతరగతి బలహీన వర్గాల ప్రజలే కావడంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సలకు అప్పు చేయాల్సి వస్తుంది అన్నారు.దోమల ద్వారా వ్యాపించే వ్యాధులలో అత్యంత ప్రమాదకరమైన వ్యాధిడెంగ్యూ అని,అది అత్యంత వేగంగా విస్తరించడం ఆందోళన కలిగించేఅంశం అన్నారు. పారిశుద్ధ్య చర్యలలో అలవిమాలిన నిర్లక్ష్యంతో పాటు, భూతాపము పెరగడమూ ఇందుకు కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ లోగడ హెచ్చరించిందన్నారు. ప్రధాన కారణం పారిశుద్ధ్య లేమి.

# తప్పయిందంటున్న తెలుగు తమ్ముళ్లు...



విశాఖపట్టణం, జులై 20 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయంతో?. గతంలో ఆ పార్టీలో చేరిన టీడీపీ మాజీ నేతలు మళ్లీ తెలుగుదేశం పార్టీ తలుపుతడుతున్నారట? తెలియక తప్పు చేశాం సరిదిద్దుకునే చాన్స్ ఇవ్వండంటూ అధిష్టానానికి వర్తమానం పంపుతున్నారని సమాచారం. ఇలా టీడీపీలో తిరిగి చేరాలనుకుంటున్న వారిలో కొందరు.. తమకు రూట్ క్లియర్ అయిందని చెప్పుకుంటుండగా, మరికొందరు నేడో రేపో పసుపు కండువాలు కప్పుకోవడమే బ్యాలెన్స్ అని ప్రచారం చేస్తుండటం ఆయా నియోజకవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. గత అసెంబ్లీలో టీడీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు వైసీపీలో చేరారు. అదేవిధంగా 2019 ఎన్నికల్లో టీడీపీలో కీలకంగా పనిచేసిన కొందరు నేతలు వైసీపీ కండువా కప్పుకున్నారు. ఇలా టీడీపీని వీడి వైసీపీలోకి వెళ్లిన నేతలు? గత ఐదేళ్లలో పార్టీపైన.. అధినేత చంద్రబాబుపైనే తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించి.. వార్తల్లో నిలిచారు. దీంతో పార్టీని వీడిన మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, కరణం బలరాం, మద్దాల గిరి, వాసుపల్లి గణేశ్‌కుమార్ టీడీపీ శ్రేణులకు టార్గెట్‌గా మారారంటున్నారు. ఇప్పుడు వైసీపీ ఓడిపోవడంతో ఆ నేతలు అంతా మళ్లీ టీడీపీలోకి వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని? వారిని ఎట్టిపరిస్థితుల్లో చేర్చుకోవద్దని పార్టీ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు.టీడీపీని వీడిన నేతలు అందరూ వైసీపీలో నష్టపోయారని? అందుకే తిరిగి వచ్చేస్తామంటున్నారనే అభిప్రాయపడుతున్నారు టీడీపీ కార్యకర్తలు. గుంటూరు పశ్చిమ నుంచి మద్దాల గిరికి వైసీపీ టికెట్ కూడా ఇవ్వకపోగా, కరణం బలరాం తన కుమారుడు వెంకటేశ్‌ను చీరాల బరిలోకి దింపారు. వాసుపల్లి, వల్లభనేని వంశీ పోటీ చేసినా చిత్తుగా ఓడిపోయారు. ఇక వల్లభనేని వంశీ అయితే ఎన్నికల ఓటమి షాక్‌తో ఆచూకీ లేకుండాపోయారు. గత ఐదేళ్లలో ఆయన వ్యవహరించిన తీరుపై పెద్ద ఎత్తున ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో టీడీపీ అండ లేకపోతే మున్ముందు మరిన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయనే భయంతో పార్టీ మారిన ఈ మాజీ నేతలతోపాటు టీడీపీతో అనుబంధం ఉన్న మరికొందరు నేతలు కూడా ఇప్పుడు తిరిగి సొంత పార్టీలోకి వచ్చేస్తామని కోరుతున్నారని ప్రచారం జరుగుతోంది.విశాఖ జిల్లాకు చెందిన వాసుపల్లి గణేశ్‌తోపాటు మాజీ మంత్రి అవంతి తిరిగి టీడీపీలో చేరేందుకు ఆ పార్టీ నేతలతో టచ్‌లోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరిలో ఒకరు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ద్వారా తమ ప్రయత్నాలు చేయగా, అధిష్టానం మొదట్లోనే చెక్ పెట్టిందంటున్నారు. ఈ ఇద్దరు నేతలకీ విద్యా వ్యాపారాలు ఉండగా, ప్రభుత్వం మారడంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ముందు జాగ్రత్త పడుతున్నట్లు చెబుతున్నారు. ఇక విశాఖ జిల్లాకే చెందిన మరో వైసీపీ నేత అడారి ఆనంద్‌కుమార్ కూడా టీడీపీలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆనంద్‌కుమార్ ఈ ఎన్నికల్లో విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.2019లో టీడీపీ తరఫున అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన ఆనంద్‌కుమార్ కుటుంబానికి విశాఖ డెయిరీ రాజకీయాల్లో మంచి పట్టు ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని గతంలో ఆయనను వైసీపీ చేర్చుకుంది. ఆనంద్‌కుమార్ తండ్రి అడారి తులసీరావుకు ఉత్తరాంధ్రలో రైతుల్లో విస్తృత పరిచయాలు ఉన్నాయి. ఆయన జీవించి ఉన్నంతకాలం టీడీపీలోనే కొనసాగారు. కానీ, అప్పటి రాజకీయాల వల్ల ఆనంద్‌కుమార్ వైసీపీలోకి వెళ్లాల్సి వచ్చిందంటున్నారు. తమ కుటుంబానికి పార్టీతో ఉన్న అనుబంధం దృష్టిలో పెట్టుకోవాలని ఆనంద్ టీడీపీ పెద్దలను కోరుతున్నట్లు సమాచారం. ఆనంద్‌తోపాటు ఆయన సోదరి యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పీలా రమాకుమారి సైతం టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని చెబుతున్నారు.ఇలా విశాఖ జిల్లా నేతలతోపాటు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కూడా కొందరు నేతలు తిరిగి సొంతగూటికి వచ్చేస్తామని మెసేజ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐతే పార్టీ కష్ట కాలంలో ఉండగా, వెళ్లిన ఏ ఒక్కరినీ తిరిగి చేర్చుకోవద్దని ఆయా నియోజకవర్గాల్లో ప్రస్తుత ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నేతలు హైకమాండ్‌ను కోరుతున్నారని సమాచారం. కార్యకర్తల అభ్యంతరాలతో అధినేత చంద్రబాబు సైతం ప్రస్తుతానికి చేరికలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు. వాస్తవానికి ప్రస్తుతానికి టీడీపీకి ఏ ఒక్కరినీ చేర్చుకోవాల్సిన అవసరం లేదు. కానీ, వైసీపీలో ఉన్న మాజీ టీడీపీ నేతలు మాత్రం అధిష్టానం మనసు కరగకపోతుందా? అంటూ పట్టు వదలని విక్రమార్కుడిలా తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ మాజీ నేతల ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో వేచి చూడాల్సిందే?

## వరద బాధితులకు కూటమి నాయకులు అండగా ఉండండి

### పెంటపాడు మండల ముంపు ప్రాంతాల పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపు

పెంటపాడు,పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో తుఫాను ప్రభావంతో వరద ముప్పు మరింత పెరిగే ప్రమాదం ఉందని కూటమి నాయకులంతా రోడ్లపైకి వచ్చి ప్రజలకు సాయం అందించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పెంటపాడు మండలంలో రాచర్ల, రావిపాడు, బి కొండెపాడు, మేన వల్లూరు, రామచంద్రపురం గ్రామాల్లో శనివారం ఆయన ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఆయనతో రైతులు తమ సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో భారీగా 20000 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని ఈ నష్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే కలెక్టర్ కు తగిన సూచనలు చేశారన్నారు. రాబోయే రెండు రోజుల్లో వర్షం కురిచే అవకాశం ఉన్నందున ప్రజలకు ఏ సహాయం కావాల్సి వచ్చినా కూటమి నాయకులు దగ్గరుండి సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. వారితోపాటు గ్రామాల్లో మండల స్థాయిలో అధికారులు చర్యలు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ,. కూటమి నాయకులు , రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆస్తి కోసం దారుణం

### తండ్రిపై దాడి చేయించిన తనయుడు

హైదరాబాద్,ఆస్తి కోసం కన్న కొడుకే ఓ వృద్ధ తండ్రి పై దాడి చేయించాడు. తన కొడుకు కోడలు, వారి బంధువుల నుండి ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని బాధిత తండ్రి కళ్లెం నర్సింహా రెడ్డి తెలంగాణ డిజిపి ని కలిసి వేడుకున్నాడు. హైదరాబాద్ దోమలగూడ కి చెందిన కళ్లెం నర్సింహా కొడుకు చంద్ర శేఖర్ రెడ్డి , కోడలు పద్మలతలు ఆస్తి కోసం పద్మలత తన బావ అయిన కొంపల్లి కి చెందిన రాఎఖీ గార్డెన్స్ యజమాని సాదా నర్సింహా రెడ్డి తో తన పై దాడి చేయించాడని బాధిత తండ్రి పిర్యాదు లో పేర్కొన్నాడు. మాజీ మంత్రి మల్లా రెడ్డి ప్రొద్భలంతో, అండతో ఆదివారం సాదా నర్సింహా రెడ్డి కుటుంబ గెట్ టూ గెదర్ ఉందని తనను పిలిపించి.. మల్లా రెడ్డి తో పాటు మరో పది మంది పెద్దల సమక్షంలో తన పై తీవ్ర పదజాలంతో దుర్భాదలడుతూ తల పై దాడి చేసి చితక బాదాడని తెలిపాడు. దీంతో తాను రెండు రోజులు అపోలో ఆసుపత్రి లో చికిత్స పొందానని చెప్పారు. తన కొడుకు కోడలు ఆస్తి కోసం తాను ఇస్తానని చెప్పినా కూడా వినకుండా నాపై ఆకారణంగా దాడి చేసి బెదిరించాడని అన్నాడు. తనకు తన కొడుకు, కోడలు, సాదా నర్సింహా రెడ్డి ల నుండి ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించేలా పోలీసులు, ప్రభుత్వం చర్యలు తీసుకొని న్యాయం చేయాలంటూ కళ్లెం నర్సింహా రెడ్డి వేడుకుంటున్నాడు.

## బంగ్లాదేశ్‌లో కర్ఫ్యూ..

### 105కు చేరిన మృతుల సంఖ్య



ఢాకా: ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ అంశంపై బంగ్లాదేశ్(ఃజీనిఐశ్రీజీటవబష్ట)లో యువత భగ్గుమంటున్న విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా అల్లర్లు చోటుచేసుకుంటున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా కర్ఫ్యూ(అబీతీటవలి) విధించారు. విద్యార్థి నిరసనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో ఇప్పటి వరకు 105 మంది మరణించారు. మరో వైపు బంగ్లాదేశ్‌లో ఉన్న 245 మంది భారతీయ పౌరులు స్వదేశం తిరిగి వచ్చారు. బంగ్లాలో గత మూడు వారాల నుంచి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. శాంతియుత పరిష్కారం కోసం విద్యార్థులు ప్రభుత్వంతో చర్చలు నిర్వహించాలని ప్రధాని షేక్ హసీనా తెలిపారు.బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం కోసం 1971లో జరిగిన యుద్ధంలో మరణించిన వారి వారసులకు ప్రభుత్వ ఉద్యోగ రిజర్వేషన్‌లలో 30 శాతం కోటా కల్పిస్తున్నారు. అయితే ఇప్పటికైనా ఈ పద్ధతిని మార్చి ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వాలని అక్కడి వర్సిటీల విద్యార్థులు, ప్రజలు కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆందోళనకారులు బుధవారం రెండు బస్సులకు నిప్పు పెట్టారు.ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో పోలీసులు రబ్బరు బులెట్లు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. కొన్నిచోట్ల అధికార అవామీ లీగ్ విద్యార్థి సంఘం నాయకులు.. ఆందోళనకారులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఘర్షణలు జరిగాయి. గురువారం రాంపురా ప్రాంతంలోని టెలివిజన్ భవన్‌లో మీడియా ప్రతినిధులతో సహా చాలామంది చిక్కుకుపోయారు.

**బహుభాషా వేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య.ఎన్ వి కృష్ణమూర్తి.**
**ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్.**

కర్నూల్, జులై 20, బహుభాషా వేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య.ఎన్ వి కృష్ణమూర్తి అని ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ తెలిపారు. ఆచార్య.ఎన్ వి కృష్ణమూర్తి శతజయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక ఉస్మానియా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ సాహిత్య సృజనకు ఆచార్య ఎన్ వి కృష్ణమూర్తి విద్యార్థులకు ఆదర్శప్రాయులని సిల్వర్ జూబ్లీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్.జి.వి రమణయ్య అన్నారు. తను కృష్ణమూర్తి గారి దగ్గర విద్యను అభ్యసించానని తెలుపుటకు చాల గర్వ పడుతున్నామన్నారు. అయన అందరికి ఆదర్శ గురువులని అన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా స్థాయి డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన సాహిత్య కార్యక్రమాలలోని విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రంతో పాటు మొదటి బహుమతి రెండువేలరూపాయల నగదు, ద్వితీయ బహుమతి పదిహేనువందల రూపాయలు తో పాటు జ్ఞాపికను అందజేశారు. విద్యార్థుల సాహిత్య పోటీలలో పద్యము లేదా కవితా రచనకు సాహితి స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, పద్యము లేదా కవితా పఠనంకు తెలుగు సాహితీ వైభవం అధ్యక్షులు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, పాటల పోటీలకు ఆకాశవాణి విశ్రాంత వ్యాఖ్యాత డాక్టర్ పోతన్న న్యాయ నిర్ణయితలుగా ఉన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా కళాశాల విశ్రాంత అధ్యాపకులు జి.కృష్ణమూర్తి, సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కురా, ఉస్మానియా కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్.మండి అన్వర్ హుస్సేన్, సాహితీ సదస్సు కార్యదర్శి జె ఎస్ ఆర్ కె శర్మ ఎన్వి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు విద్యార్ధిని విద్యార్థులు పాల్గొన్నారు.



# ఏజెన్సీలో భారీ వర్షం

## స్థంభించిన జనజీవనం

ఏలూరు,రెండు రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఏలూరు జిల్లాలోని పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, తదితర గ్రామాలలో కు వెళ్లే



రహదారులపై వాగులు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. బుట్టాయిగూడెం మండలం రెడ్డిగణపవరం నుంచి రామారావు పేట వెళ్లే రహదారి మధ్యలో జల్లేరు వాగు ఉధృతికి కాజ్వే కింద ఉన్న సిమెంట్ తూరలు కొట్టుకుపోయాయి. బుట్టాయిగూడెం మండలం కామవరం అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి ఆలయం వద్ద వాగులు ఉదృతంగా ప్రవహించడంతో ఆలయానికి వెళ్లే మార్గాలు ఛిద్రం గా మారాయి. దీంతో ఆలయ కమిటీ సభ్యులు, గిరిజనులు కలిసి రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న భారీ వృక్షాలు జెసిబి సహాయం తో తొలగించి రాకపోకలకు వీలు కల్పించారు. మరో రెండు రోజులపాటు ఏజెన్సీలో వర్షాలు విస్తారంగా పడనున్న నేపథ్యంలో గిరిజన గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది.

# ఖతర్ వాసికి లోకేష్ భరోసా

అమరావతి సౌదీ అరేబియాలో దుర్భర జీవితం గడుపుతున్న మరో తెలుగువాడికి మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. నకిలీ ఏజెంట్ చేతిలో మోసపోయి దుర్భర జీవితం గడుపుతున్నా అంటూ ఎక్స్ లో వీడియో వీరేంద్ర కుమార్ పోస్టు చేసాడు. ఖతర్ లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించి సౌదీలోని ఎడారిలో ఒంటెల మధ్య తనని పడేశారని వీరేంద్ర ఆవేదన పడ్డాడు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బతకలేకపోతున్నానని వీడియో పోస్ట్ చేసాడు. వీరేంద్ర వీడియో చూసి మంత్రి నారా లోకేష్ స్పందించారు. ధైర్యంగా ఉండాలని, స్వస్థలానికి తిరిగి తీసుకొచ్చే బాధ్యత తనదని లోకేష్ హామీ ఇచ్చారు.

# తాడిపత్రి మున్సిపాలిటీలో ఆసక్తికర దృశ్యం

అనంతపురం, జూలై 20 అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపాలిటీలో ఆసక్తికర దృశ్యం ఆవిష్కృతమైంది. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ గా జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు జేసీ అస్మిత్ రెడ్డి ఎమ్మెల్యే హోదాలో హాజరయ్యారు. గతంలో 2014లో ఎమ్మెల్యేగా జేసీ ప్రభాకర్ రెడ్డి కౌన్సిల్ సమావేశంలో పాల్గొనగా.. జేసీ అస్మిత్ రెడ్డి కౌన్సిలర్ గా సమావేశంలో పాల్గొన్నారు. తాజా సమావేశంలో జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అస్మిత్ రెడ్డికి కీలక విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం ప్రజా సమస్యలపై, తాడిపత్రి మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అసెంబ్లీలో చర్చించాలని, తద్వారా నిధులు తీసుకొచ్చేలా కృషి చేయాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డిని ప్రభాకర్ రెడ్డి కోరారు. అంతకుముందు కౌన్సిల్ సమావేశంలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డితో చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కౌన్సిల్ సమావేశంలో తండ్రీ, కొడుకులను చూసి జేసీ కుటుంబం అభిమానులు, టీడీపీ శ్రేణులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.జేసీ అస్మిత్ రెడ్డి మాట్లాడుతూ.. కౌన్సిల్ సభ్యులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తాడిపత్రి నియోజకవర్గం సమస్యలు, మున్సిపల్ సమస్యలపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాను. ఆయన సానుకూలంగా స్పందించారని అస్మిత్ రెడ్డి అన్నారు. అలాగే త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లోనూ తాడిపత్రి నియోజకవర్గం సమస్యలపై ప్రస్తావిస్తానని కౌన్సిల్ సమావేశంలో పేర్కొన్నారు.

# చంద్రబాబుపై బహిరంగ విమర్శలు..

## పోలీసు అధికారుల సంఘం క్షమాపణలు

విజయవాడ,టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యతో పోలీసు సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. సీఎం చంద్రబాబుపై విమర్శలు చేయడంపట్ల సంఘం నేతలు క్షమాపణలు చెప్పారు. పైఅధికారుల వల్లే అలా చేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చుకున్నారు. ఎవరు అధికారంలో ఉంటే వారి విధానాలు అమలు చేస్తామని అన్నారు.. అప్పట్లో జరిగిన పరిణామాలను మనసులో పెట్టుకోవద్దని బతిమలాడారు. పై అధికారుల ఒత్తిడి వల్ల

అలా అనాల్సి వచ్చిందని అని చెప్పుకొచ్చారు. అనంతరం, ఏపీ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు.వర్ల రామయ్యను కలిసి పోలీసు బైలాస్లో ఉన్న కొన్ని నిబంధనలను తొలగించాలని కోరాం. పోలీసు వ్యవస్థ మనోభావాలు దెబ్బతీసేలా ఎవరైనా మాట్లాడితే దానికి కౌంటర్ ఇవ్వడమే కానీ వ్యక్తిగతంగా ఎవరిపైనా కక్ష లేదు. నాడు చంద్రబాబుపై విమర్శలు చేసినప్పుడూ ఒక పోలీసు అధికారిగా అలా చేయకూడదని నాకు అనిపించింది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు పోలీసు వ్యవస్థను నిందించినప్పుడు కూడా ఖండించాం. ప్రభుత్వ ఉద్యోగిగా ఎవరు అధికారంలో ఉంటే వారి విధానాలను అమలు చేయాల్సి వస్తుంది. మాకంటూ ప్రత్యేక అధికారాలేమీ ఉండవు. ఒకప్పుడు ఆంధ్ర పోలీసులు పనికిరారని తెలంగాణ పోలీసుల్ని ఆశ్రయించిన వైసీపీ అధినేత జగన్.. అదే ఆంధ్ర పోలీసులతోనే గత ఐదేళ్లు పాలించారు.ఇప్పుడు మళ్లీ పోలీసుల్ని తప్పుబట్టడం సరికాదు. జగన్ వ్యాఖ్యాల్ని తీవ్రంగా ఖండిస్తున్నాం" అని పేర్కొన్నారు.

# కలకలం రేపుతున్న రాజకీయదాడులు

విజయవాడ, జూలై 20 ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు, హింసాత్మక ఘటనలు అధికారంలోకి వచ్చిన నెల రోజుల వ్యవధిలోనే కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో చర్చ జరిగడానికి కారణం అవుతున్నాయి. గత నెలలో కనీవిని ఎరుగని మెజార్టీతో అసెంబ్లీలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. నెల రోజుల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా చెదురుమదురు ఘటనలు జరిగినా వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేనాని పవన్ కళ్యాణ్ ఖండిస్తున్నారు. చంద్రబాబు నాయకుల్ని పదేపదే హెచ్చరిస్తున్నారు రౌడీయిజం, గుండాయిజాన్ని సహించేది లేదని, నాయకులు సంయమనం పాటించాలని కొత్త ప్రభుత్వాన్నిముందుకు తీసుకు వెళ్లేందుకు సహకరించాలని కోరుతున్నారు.పార్టీ అధినేతలు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా దాడులు, హింసాత్మక ఘటనలకు మాత్రం అడ్డు పడటం లేదు. బుధవారం రాత్రి వినుకొండలో వైసీపీ సానుభూతిపరుడైన యువకుడిని ప్రత్యర్థి దారుణంగా నరికి చంపడం తీవ్ర సంచలనం సృష్టించింది. గత నెల రోజులుగా అధికార పార్టీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలకు పెద్దగా ప్రచారం లభించకపోయినా బుధవారం జరిగిన యువకుడి దారుణ హత్య అందరిని ఉలిక్కి పడేలా చేసింది. పల్నాడు జిల్లా ఎస్పీని బదిలీ చేసిన రోజుల వ్యవధిలో పల్నాడులో జరిగిన హత్య, వైసీపీకి రాజకీయంగా ఊపిరి పోసింది.నడిరోడ్డుపై జరిగిన హత్యపై పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. గురువారం ఉదయంలోపు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వీడియోలు వైరల్‌గా మారాయి. టీడీపీ జరుగుతున్న నష్టాన్ని గుర్తించేలోపు వినుకొండ యువకుడి హత్య ఘటన వైరల్ అయిపోయింది. టీడీపీ నేతలు హత్యకు పాల్పడిన జిలానీ తమ పార్టీకి చెందిన వాడు కాదని, ఇద్దరి మధ్య పాతకక్షలతో ఘటన జరిగిందని చెప్పుకునే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండా పోయింది.ఏపీలో ఘోర పరాజయం తర్వాత అసెంబ్లీలో అడుగు పెట్టడానికి కూడా వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆసక్తి చూపలేదు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత బెంగుళూరు వెళ్లిపోయారు. అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ఉండటానికే జగన్ బెంగుళూరు వెళ్లిపోయారని టీడీపీ నేతలు విమర్శించారు. వినుకొండలో రషీద్ హత్య తర్వాత జగన్ వెంటనే విజయవాడ వచ్చారు.బుధవారం రాత్రి వినుకొండలో రషీద్ అనే యువకుడిని షేక్ జిలానీ అనే మరో యువకుడు హత్య చేశాడు. వీళ్లిద్దరూ ఒకప్పుడు స్నేహితులే. వైసీపీలో ఉండేవారు. వినుకొండలో రౌడీగా చలామణీ అవుతున్న పీఎస్ ఖాన్ ముఠాలో రషీద్, జిలానీ సభ్యులుగా ఉండేవారు. తర్వాత . వీరి మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. 2022 తొలి ఏకాదశి రోజున వినుకొండలో జరిగే కొండ తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీలో వీరి మధ్య గొడవలు మొదలయ్యాయి.ఖాన్ ఓ లాడ్జిలో నిర్వహించిన పార్టీలో జిలానీ బీర్ బాటిళ్లతో దాడి చేయడంతో ఒక యువకుడు గాయపడ్డాడు. ఈ ఘటనలో ఖాన్.. రషీద్ కు మద్దతుగా నిలిచాడు. జిలానీపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆ తర్వాత రషీద్, ఖాన్ గ్యాంగ్‌లో మరి కొందరు గత ఏడాది జూలైలో జిలానీ ఇంటిపై దాడి చేశారు. జిలానీ ఇంట్లో లేకపోవడంతో అతని అన్న జానీపై దాడి చేసి గాయపరిచారు.ఇంట్లో వస్తువులను ధ్వంసం చేశారు. ఇంటి ముందు వాహనాన్ని కూడా తగలపెట్టారు. ఎమ్మెల్యే బొల్లా కారణంగా పోలీసులు జిలానీ కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు పట్టించుకోలేదు. యువకుడిపై దాడి కేసులో జిలానీపై హత్యాయత్నం కేసు పెట్టి జైలుకు పంపారు. దీంతో గత ఏడాది అతని టీడీపీ గూటికి చేరాడు. అదను చూసి హత్యకు పాల్పడ్డాడు. తన ఇంటిపై రషీద్ దాడి చేసిన రోజే ప్రత్యర్థిని మట్టుబెట్టాడు.జిలానీ, రషీద్‌ల మధ్య ఉన్న వ్యక్తిగత శతృత్వాలకు రాజకీయాలు అండగా నిలవడతంతో అవి కాస్త హత్యలకు తెగించేలా ప్రోత్సహించాయి. వినుకొండలో హత్య తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రం విడుదలను కూడా వాయిదా వేసుకున్నారు. గురువారం శాంతిభద్రతలపై సచివాలయంలో చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేయాల్సి ఉంది. అదే సమయంలో వినుకొండ హత్య తీవ్ర సంచలనం సృష్టించడంతో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. వచ్చే వారం మొదలయ్యే అసెంబ్లీ సమావేశాల్లో వాటిని విడుదల చేయాలని నిర్ణయించారు.వినుకొండలో జరిగిన హత్యపై వైసీపీ అధ్యక్షుడు ప్రధానికి లేఖరాశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని,వైసీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి, ఆ వెంటనే..

ఈ ఎన్నికల్లో తమను సమర్థించని, తమకు ఓటు వేయని వారిని లక్ష్యంగా చేసుకుంది. ముఖ్యంగా మా పార్టీ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులను వేధించడమే పనిగా పెట్టుకుంది.తమ కార్యకర్తల్ని కొట్టడం, చంపడం, దారుణంగా వేధించి భయానక పరిస్థితులు సృష్టించడం వంటివన్నీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆస్తులు విధ్వంసం చేస్తున్నారు. ఇళ్లు, భవనాలు కూల్చేస్తున్నారు. వ్యాపార సంస్థలపైనా దాడులు చేస్తున్నారు. పట్టపగలు యథేచ్ఛగా కొనసాగుతున్న ఈ ఘటనలు రాష్ట్రంలో ఒక భయానక పరిస్థితి నెలకొనేలా చేస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. శుక్రవారం హత్యకు గురైన రషీద్‌ను పరామర్శించేందుకు వినుకొండ వెళ్లారు.పార్టీలు మారినా పాలనలో మార్పు రాకపోవడంపై ఏపీ ప్రజల్లో నిర్లిప్తత ఏర్పడింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే రాజకీయ వాతావరణం హింసాత్మకం తయారవడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇచ్చేవారు. ప్రస్తుతం సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో చాలామంది సేవల్ని ప్రభుత్వం వాడుకునే పరిస్థితులు లేవు. గతంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారనే కారణాలతో వారిని పూర్తిగా పక్కన పెట్టేశారు.కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి బోలెడు సవాళ్లు ఉన్నాయి. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఓ వైపు ఎన్నికల హామీల అమలుపై పైసపైస కూడబెట్టుకుంటోంది. ఈ క్రమంలో రాజకీయంగా ప్రత్యర్థులు బలపడేలా జరుగుతున్న ఘటనలు, వాటిని కనీసం ఖండించలేని వాతావరణం రాష్ట్ర ప్రజల్ని అయోమయంలో పడేస్తున్నాయి. పార్టీలు, ప్రభుత్వాలు మారినా ఏపీ తలరాత మారదనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

# ఆరోపణలు ఉన్నవారికే వీసీ పదవులు

## విద్యాశాఖలో ఏం జరుగుతోంది

గుంటూరు, జూలై 20 ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటై నెలరోజులు గడుస్తోంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్లు పదవుల నుంచి తప్పుకున్నారు. ఏయూ, నాగార్జున వంటి విశ్వవిద్యాలయాల్లో ఉద్రిక్త పరిస్థితులు కూడా నెలకొన్నాయి. కొన్ని చోట్ల ఒత్తిళ్ల నడుమ వీసీలు పదవుల నుంచి తప్పుకున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని పలు యూనివర్శిటీలకు ఇంచార్జి వైస్‌ఛాన్సలర్లను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.రాష్ట్ర వ్యాప్తంగా 17 యూనివర్శిటీలకు ఇంచార్జి వీసీలను నియమించారు. ఈ క్రమంలో కొన్ని నియామకాలపై రగడ మొదలైంది. వీసీలకు బాధ్యతలు అప్పగించే క్రమంలో ఆ శాఖ మంత్రిని కొందరు తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఆంధ్రా విశ్వవిద్యాలయం, గుంటూరులోని ఆచార్య నాగార్జునా విశ్వ విద్యాలయం, రాయలసీమ వర్శిటీల్లో నియామకాలపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయ ఇంచార్జి బాధ్యతలను శశి భూషణరావుకు అప్పగించడంపై నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏయూ మాజీ వీసీ ప్రసాద్ రెడ్డి ఆత్మే వర్శిటీని పాలించినట్లుగానే ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి.ఆచార్య జి.శశిభూషణరావు ఏ.యూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ గా ఉన్నారు. మాజీ వీసీ ఆచార్య పీవిజిడి. ప్రసాద్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందా?రు2014-19 మధ్యకాలంలో ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడు అండదండలతో శశిభూషణరావు ఏయూ పాలకమండలి సభ్యుడిగా వ్యవహరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రసాద్ రెడ్డికి వర్శిటీలో సీనియర్ ప్రొఫెసర్ గా పదోన్నతి కల్పించడంలో పాలకమండలి సమావేశాలలో కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి.అర్హతలు లేకపోయినా సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతులు దక్కడంలో కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయూ వీసీగా ప్రసాదరెడ్డి ఏకపక్షంగా వ్యవహరించినా శశిభూషణరావు ఏనాడు వాటిని ఖండించలేదని అధ్యాపకులు చెబుతున్నారు.ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గా, ఇంజనీరింగ్ కాలేజీలోప్రసాద్ రెడ్డి చర్యలను సమర్థించారని అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వారికే బాధ్యతలు అప్పగించడాన్ని అధ్యాపకులు తప్పు పడుతున్నారు. ఏయూలో చేసిన నియామకాలపై మానవవనరుల శాఖ మంత్రికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.ఆచార్య నాగార్జునలో మరో వివాదం?ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంచార్జి వీసీ నియామకం పై దుమారం రేగుతోంది. నాగార్జున యూనివర్సిటీ ఇంచార్జి వీసీగా ప్రొఫసర్ కంచర్ల గంగాధర్ 1988 నుండి కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం యూనివర్సిటీ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు.యూనివర్సిటీ వ్యవహారాలపై పెద్దగా పట్టు లేదని, బోధనేతర సిబ్బందితో పాటు సహచర అధ్యాపకులకు సైతం ఆయన గురించి పెద్దగా తెలీదని అధ్యాపకులు చెబుతున్నారు. అకడమిక్ విభాగంలో యూనివర్సిటీలో ఎలాంటి గుర్తింపు లేకపోయినా బాధ్యతలు కట్టబెట్టడాన్ని తప్పు పడుతున్నారుఅధ్యాపక వృత్తిలో ఉండగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం 4ఏళ్లు సెలవుపెట్టి వెళ్లారని చెబుతున్నారు. రెండేళ్లుగా మాజీ వీసీకి అనుకూలంగా వ్యవహరించారని , మాజీ వీసీ హయంలో జరిగిన అవినీతి అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉండదని అధ్యాపకులు, విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.గత ఐదేళ్లలో యూనివర్శిటీకి అవసరం లేకున్నా పెద్ద ఎత్తున వైసీపీ సానుభూతి పరులకు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను కట్టబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.100కోట్లకు పైగా యూనివర్శిటీ నిధులు దుర్వినియోగం చేశారని, కాంట్రాక్టర్లకు దాదాపు రూ.3కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉందని, ఈ పనులు చక్కబెట్టడం కోసమే కొందరు చక్రం తిప్పి ఇంచార్జి బాధ్యతలు దక్కేలా చేశారని ఆరోపిస్తున్నారు. మాజీ వీసీ అనుచరులకు గెస్ట్ ఫ్యాకల్టీగా అవకాశం కల్పించారని కొత్త ప్రభుత్వంలో వైసీపీ అనుకూలురికే బాధ్యతలు అప్పగించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రాయలసీమ యూనివర్సిటీ ఇంచార్జ్ వీసీగా ఎన్‌టికే నాయక్ ఎంపికపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాయక్‌పై విజిలెన్స్ ఎంక్వయిరీ పెండింగ్‌లో ఉంది.రాయలసీమ యూనివర్శిటీలో నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ఉన్నత విద్య మండలి జరిపిన విచారణలో రూ.1.39కోట్ల విలువైన ఓచర్లు, రూ.7.70లక్షల విలువైన ఫర్నీచర్ మాయమైనట్టు విజిలెన్స్2016లో జరిగిన విచారణలో గుర్తించారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందడంతో మాజీ వీసీ జే.వీ.ప్రభాకర్, 2016లో వీసీగా ఉన్న ప్రొఫెసర్ కృష్ణనాయక్, అప్పటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్‌టికె.నాయక్ సూపరింటెండెంట్ నారాయణప్పలపై విచారణ జరిపి దోషులెవరో నిర్ధారించాలని నాటి ప్రిన్సిపల్ సెక్రటరీ సుమిత్రా దావ్రా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా అభియోగాలను నమోదు చేసి సిఐడి విచారణ జరిపారు.రాయలసీమ యూనివర్శిటీలో రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఎన్‌టికె నాయక్‌పై విచారణ జరిపి, ఛార్జిషీట్ నమోదు చేసేందుకు 2023 జనవరి27వ తేదీన నాటి వర్శిటీ రిజిస్ట్రార్ ప్రభుత్వానికి అనుమతించారు. ప్రొఫెసర్ ఎన్.టి.కె.నాయక్‌తో పాటు సూపరింటెండెంట్ ఎం.వి. నారాయణప్పలపై ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు యనివర్శిటీ పాలక మండలి 2024 జనవరి 24న అమోదం తెలిపింది. దాని ఆధారం గా ఛార్జిషీట్ కు ఇంఛార్జి విసిగా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది .విద్యాశాఖ లో ఏమి జరుగుతోంది? విద్యాశా ఖలో తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాల వెనుక ఓ అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాయలసీమ జిల్లాలో అత్యంత వివాదాస్పందగా వ్యవహరించిన సదరు అధికారి కొత్త ప్రభుత్వంలో మంత్రి పేషీలో పాగా వేశారు. ఇంటెలిజెన్స్ నివేదికల్లో అతనికి ప్రతికూలంగా ఉన్నా, అవినీతి ఆరోపణలు వచ్చినా సదరు అధికారి విజయవంతంగా మంత్రి పేషీలో పాగా వేశారు. ఆ తర్వాత ప్రభుత్వం తరపున తీసుకునే కీలక నిర్ణయాల్లో తప్పుదోవ పట్టిస్తూ ప్రభుత్వాన్ని ప్రభావితం చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

# బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసిన బత్తిన వెంకటరాముడు

తుగ్గలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితను ఉమ్మడి జిల్లాల మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు శనివారం రోజున మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.రాష్ట్రంలో వెనుకబడిన బీసీల అభివృద్ధి కొరకు కృషి చేయాలని మంత్రిని కోరినట్లు బత్తిన వెంకటరాముడు తెలియజేశారు. అదేవిధంగా కర్నూలు జిల్లా మరియు పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి కొరకు కృషి చేయాలని మంత్రిని కోరినట్లు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు తెలియజేశారు.దీనిపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సానుకూలంగా స్పందించినట్లు ఉమ్మడి జిల్లాల మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మరియు టిడిపి రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకటరాముడు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# షాకిస్తున్న టమాటాలు



విజయనగరం, జూలై 20, రాష్ట్ర వ్యాప్తంగా గత నెలరోజులుగా టమాటా ధరలు మండిపోతున్నాయి. అంతకు ముందు దాకా వందకు ఐదారు కిలోలంటూ వ్యాపారులు వెంటపడి మరీ అంటగట్టారు. కొన్ని ప్రాంతాలలో గిట్టుబాటు ధర రాక టమాటా రైతులు మార్కెట్ ఛార్జీలు కూడా తమకు గిట్టుబాటు కావడం లేదని రోడ్డుపైనే పంటంతా పారబోసి తమ నిరసన వ్యక్తంచేసిన వార్తలు చూశాము. ఈ సారి మాత్రం రెండు తెలుగు రాష్ట్రాలలో టమాటా ధరలు సామాన్యులకు అందుబాటులోకి లేని స్థాయికి చేరుకున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఈ సారి తెలుగురాష్ట్రాలలో అధిక ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. తర్వాత సకాలంలో వర్షాలు సైతం కురవకపోవడంతో టమాటా దిగుబడి భారీ స్థాయిలో పడిపోయింది.ఇప్పటికే ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు టమాటా విక్రయదారులు. యావరేజ్ న రూ.50 నుంచి 60 రూపాయల దాకా అమ్మకాలు ఉంటున్నాయి. అయితే అనూహ్యంగా విశాఖపట్నం మార్కెట్ లో టమాటా ధరలు వ్యాపారులు కేజీ రూ.100కి పెంచేశారు. టమాటా దిగుబడి తగ్గిపోవడంతో తప్పనిసరిగా రేటు పెంచాల్సి వచ్చిందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ విషయంలో రైతులు మాత్రం చాలా హ్యాపీగా ఉన్నారు. గత ఏడాది గిట్టుబాటు ధర లభించక నానా అవస్థలు పడ్డామని..ఈ ఏడాది ఆ నష్టాన్ని కూడా రికవరీ చేసే విధంగా టమాటా ధరలు పెరగడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.సామాన్యులు మాత్రం కేవలం ఒక్క వంద రూపాయలే టమాటా పై పెడితే మిగిలిన కూరగాయలను కొనుగోలు చేసేదెలా అని ఆందోళన పడుతున్నారు. తాము మధ్యతరగతి కుటుంబానికి చెందినవారమని ప్రతినిత్యం ఉల్లిపాయలు, టమాటాలు తమ వంటలలో చేరుస్తామని..కేవలం కూరగాయలతో వంటలు చేసుకోవాలంటే తలకు మించి భారమవుతుందని..దానికి టమాటాలు చేర్చడం ద్వారా కలిసి వస్తుందని అంటున్నారు. అసలే నిత్యావసరాలు పెరిగిపోయాయని బాధపడుతుంటే ఇప్పుడు కామన్ మ్యాన్ ఇష్టపడి తినే టమాటా రేటు కూడా పెరిగిపోతే ఏం తినాలి తాము అని అడుగుతున్నారు. కొందరు దళారీలు టమాటాలను గోడౌన్ లలో నిలవ చేసి రేటు అధికంగా అమ్ముకుంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి.కూరగాయల హోల్ సేల్ మార్కెట్ కు కూడా టమాటాలు తక్కువ సంఖ్యలో వస్తున్నాయి. మేమే కిలో 50 రూపాయలకు కొనుగోలు చేస్తున్నామని వ్యాపారవేత్తలు చెబుతున్నారు. కనీసం పదో, ఇరవయ్యో ఎక్కువగా అమ్ముకోకపోతే ఎలా అని వ్యాపారులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. విశాఖలో పెరిగిన టమాటా ఎఫెక్ట్ ఇప్పుడు ఏపీ వ్యాప్తంగానే కాక పొరుగున ఉన్న తెలంగాణపైనే పడేలా ఉంది. ఇప్పటికే హైదరాబాద్ లో ఏ1 గ్రేడ్ టమాటాలు రూ.100కి అమ్ముతున్నారు. ఇప్పవు సాధారణ రకం కూడా వందకు పెరిగేలా ఉందని కొనుగోలు దారులు గగ్గోలు పెడుతున్నారు

# పితానికి కలిసిరాని కాలం

కాకినాడ, జూలై 20, పితాని సత్యనారాయణ అంటే తెలియని వారుండరు. సీనియర్ నేతగా ఆయన పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక సామాజికవర్గానికి బలమైన నేత. ఆయన వెంటే లక్కు ఉంటుందని అందరూ భావిస్తారు. పార్టీ మారినా అధికారంలోకి రావడమే కాకుండా మంత్రి పదవి కూడా ఇంటికి వచ్చి తలుపుతడుతుందని ఆయన అనుచరులు భావిస్తారు. ఆయన ఉన్న పార్టీ అధికారంలోకి వస్తే చాలు తమ నేతకు మంత్రి పదవి గ్యారంటీ అని విశ్వసిస్తారు ఆయన అనుచరులు. బలమైన శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన పితాని సత్యనారాయణకు నియోజకవర్గంలోనే కాదు జిల్లాలోనూ కీలక నేతగా పరిగణిస్తారు పితాని సత్యనారాయణ కు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి పదవి దక్కింది. ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చినా చంద్రబాబు పితానికి ఆలస్యంగానైనా మంత్రి పదవి ఇచ్చారు. బలమైన శెట్టి బలిజ సామాజిక వర్గం కావడం, ఆయన సామాజిక వర్గం ఐదారు శాసనసభ నియోజకవర్గాల్లో బలంగా ఉండటంతో ప్రతి పార్టీ ఆయన కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తుంటుంది. పెనుగొండ, ఆచంట నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. రెండుసార్లు మంత్రి పదవిని దక్కించుకున్నారు. శెట్టి బలిజ సామాజికవర్గానికి చెందిన పితాని సత్యనారాయణ కాంగ్రెస్, టీడీపీ హయాంలో ఒక వెలుగు వెలిగారు. ఆయన తొలుత వైసీపీలో చేరాలనుకుని 2014లో ఆయన టీడీపీలో చేరి తిరిగి ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో జగన్ హవా ముందు ఆయన ఓటమి పాలయ్యారు. అయితే 2019 ఎన్నికల్లో ఆచంట నుంచి పోటీ చేసిన పితాని సత్యనారాయణ ఆ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఐదేళ్ల పాటు పార్టీలోనే ఉంటూ జిల్లా వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయడం కోసం ప్రయత్నించారు. పితాని, ఆయన కుమారుడిపై కేసులు కూడా నమోదయ్యాయి. అయితే ఆయన నాడు పార్టీ మారతారన్న ప్రచారం జరిగినా తాను టీడీపీలోనే కొనసాగుతానని చెప్పి పితాని సత్యనారాయణ సైకిల్ పార్టీకి దన్నుగా నిలిచారు. అధికారంలోకి వస్తే తనకు మంత్రి పదవి గ్యారంటీ అని భావించారు. తనను కాదని మంత్రి పదవి ఎక్కడకు పోతుందన్న ధీమాలో ఉన్నారు.కానీ 2024లో ఆచంట నియోజకవర్గం నుంచి పితాని సత్యనారాయణ గెలిచారు. ఇటు కూటమి కూడా అధికారంలోకి వచ్చింది. కానీ మంత్రి పదవి మాత్రం దక్కలేదు. సీనియర్ నేతలను అందరినీ పక్కన పెట్టిన నేపథ్యంలో పితాని సత్యనారాయణను కూడా టీడీపీ అధినేత తన కేబినెట్ లో చోటు కల్పించలేదు. ఫలితంగా ఆయన తీవ్ర నిరాశకు గురయినట్లు తెలిసింది. గత కొద్ది రోజులుగా నియోజకవర్గానికే పరిమితమైన పితాని సత్యనారాయణ విజయవాడకు ముఖ్యమైన సమావేశాలకు కూడా రాలేదని చెబుతున్నారు.

# ఆల్వ కొండ లో ఘనంగా జరియాత్ మహోత్సవం



సంజామల మండలం శ్రీ ప్రస్థానం.. న్యూస్ ఆల్వ కొండ లో జరియత్ మహోత్సవం ఘనంగా నిర్వహించారు .,.. ప్రతి ఏటా ఆనవాయితీగా వస్తున్న ఈ జరియత్ మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు ...మౌలాలి స్వామి... దస్తగిరి స్వామి వారి ప్రతిరూపాలైన పీర్లను పూల చే రలు... దగదగా లాడే దట్టిలతో అలంకరించి న స్వామి వార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు .... కులమతాలకు అతీతంగా గ్రామంలోని ప్రజలు దస్తగిరి స్వామి.. మౌలాలి స్వామి పీర్లకు ముక్కులు చెల్లించుకున్నారు.... అనంతరం శనివారం ఉదయం గ్రామంలోని వీధుల గుండా స్వామి వార్లను ఊరేగించారు ... ప్రతి గడప లో భక్తులు పూజలు నిర్వహించారు.వారి మొక్కలు చెల్లించుకున్నారు... గ్రామంలో ఉ త్సవం అనంతరం కొండపైన ఉన్న దర్గాలో మౌలాలి స్వామి , దస్తగిరి స్వామి పీర్లను ప్రతిష్టించారు ....మీా వేడుకను చూసేందుకు ఆల్వ కొండ గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు వేలాదిగా తరలివచ్చారు ...

## ఇంటికి వినియోగించుకునే విద్యుత్ సర్వీస్ కు ఎర్తింగ్ సిస్టం తప్పని సరి.కోవెలకుంట్ల విద్యుత్ శాఖ ఏ.ఈ. రామ్మోహన్..

దొర్నిపాడు, జూలై:20, శ్రీ ప్రస్థానం న్యూస్ :- ఇంటికి వినియోగించుకునే విద్యుత్ సర్వీస్ కు మరియు ఇంటిలో ఉపయోగించుకునే పరికరాలకు తప్పని సరిగా ఎర్త్ పైప్ ద్వారా ఎర్త్ రింగ్ ను ఏర్పాటు చేసినట్లయితే విద్యుత్ ప్రమాదాల నుండి ఇంటిని రక్షించు కోవచ్చునని కోవెలకుంట్ల విద్యుత్ శాఖ ఏ.ఈ.రామ్మోహన్, విద్యుత్ వినియోగ దారుల కు సూచించారు. శని వారం నాడు స్థానిక మండల విద్యుత్ ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహ విద్యుత్ వినియోగ దారులు అవసరాల నిమిత్తం అవరణంలో అంతర్గత వైరింగ్ కు ఉపయోగించే స్విచ్,లు హోల్డర్స్, పరికరాలు నాణ్యత కలిగి ఉండాలనీ వీలైనంత ఎత్తులో స్విచ్ బోర్డులను ఏర్పాటు చేయాలని.. అలాగే ఇంటిలో ఉపయోగించే టి.వి. వంటి తదితర పరికరాలకు తప్పని సరిగా ఎర్త్ వైర్ ను ఏర్పాటు చేయాలని.. హోల్టేజ్ కు తగ్గ సర్వీస్ వైర్ ను వాడుకం వల్ల విద్యుత్ సరపారాలో అంతరాయం లేకుండా హై ఓల్టేజ్ తోపాటు హెచ్చు తగ్గులు నియంత్రించ వచ్చునన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే ముందు విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు దగ్గరలో ఉన్న యెడల విద్యుత్ సిబ్బందికి తగు సమాచారం అందిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం దూరంగా ఉ ండేలా తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు..వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన సపోర్ట్ తీగను తగల వద్దని, తడి



కాళ్ళతో, తడి చేతులతో స్విచ్ లు వేయరాదని.. ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనించిన యెడల ఆ వ్యక్తిని గానీ విద్యుత్ పరికరాన్ని నేరుగా తాక రాదని వెంటనే దగ్గరలోని విద్యుత్ శాఖ అధికారులకు గానీ లేదా విద్యుత్ సిబ్బందికి సమాచారాన్ని తెలియచేయాలని ఆయన తెలిపారు.. తోటల్లో కానీ పొలాలలో కానీ ఏ ఇతర ప్రదేశాల్లోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు తెగి పడి ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ నేరుగా వాటిని తాక రాదని వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 కి ఫోన్ చేసి సమాచారాన్ని తెలియచేయాలన్నారు గ్రామాల్లో ఏదైనా విద్యుత్ సమస్యలు ఉన్నా క్రమంలో విద్యుత్ సిబ్బందికి మాత్రమే సమాచారం ఇవ్వాలని,, ప్రైవేట్ వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ సంప్రదించవద్దన్నారు.. విద్యుత్ శాఖ అదికారులు చెప్పిన సూచ నలను,సలహాలను అనుసరించి విద్యుత్ వినియోగ దారులు తగు జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలను పూర్తి స్థాయి లో నియంత్రించ వచ్చునని విద్యుత్ శాఖ ఏ.ఈ. రామ్మోహన్, తెలిపారు..ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

# కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం. డాక్టర్ బాబు.

కుష్టు వ్యాధిగ్రస్తులను పరిశీలిస్తున్న వైద్యాధికారి.





నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-కుష్టు వ్యాధిని నిర్మూలిద్దామని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బాబు అన్నారు. శనివారం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి బాబు మండలంలోని తిప్పారెడ్డిపల్లె గ్రామంలో ప్రతి ఇంటి ఇంటికి తిరుగుతూ కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించి వారిని పరిశీలించి వారికి తగు సూచనలు, సలహాలు తెలియజేసి వారికి వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. ఇంకా ఎవరైనా గ్రామంలో అనుమానాస్పదంగా ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తే పరీక్షలు నిర్వహించి పరిశీలిస్తామన్నారు. అలాగే ఈ కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమము 18 -07- 2024 వ తేదీ నుండి 02 -08 -2024 వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఈ కుష్టు వ్యాధి సోకిన వారికి చర్మంపై స్పర్శ లేని రాగి రంగు గల మచ్చలు, మరియు చర్మం పొడిగా ఉ ండడం, కనుబొమ్మలు మరియు కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూతపడకపోవడం, మందమైన మెరిసే జిడ్డు గల మొహం, చెవులపై బొడిపెలు, చేతుల నుండి వస్తువులు జారిపోవడం, అరిచేతులు అరికాళ్లలో స్పర్శను కోల్పోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చల్లని లేక వేడి వస్తువుల స్పర్శ తెలియకపోవడం, చేతి వేళ్ళు కాలి వేళ్ళు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం, కాళ్లు చేతులు తిమ్మిర్లు వేయడం లేక జోములు కలిగి ఉండుట, తెలియకుండానే చేతులు కాళ్లల్లో బొబ్బలు రావడం ఇలాంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధిక వర్షాల వల్ల పంటలను కాపాడుకోవడం ఎలా.... వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ.



రైతులకు సలహాలు ఇస్తున్న ఏఓ.

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-ప్రస్తుతం అధిక వర్షాలు కురుస్తున్నందున పంటలను ఎలా కాపాడుకోవాలో అని రైతులతో మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ సమావేశం నిర్వహించారు. శనివారం మండలంలోని ఎర్రగుడుదిన్నె గ్రామంలో రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు పొలంలో నిలువ ఉండడం వలన ఏ ఏ పంటలను ఎలా కాపాడుకోవాలో ఆయన కింది సూచనలతో తెలియజేశారు. మొక్కజొన్న, కంది, మినుము, వేరుశనగ, ప్రత్తి,, ఉల్లి, పసుపు మరియు పండ్లు , కూరగాయల పొలాలు అధిక తేమ మరియు వర్షపు నీటి ముంపునకు గురియినవి . మొక్కలను మొదలు కుళ్ళు, వేరు కుళ్ళు, మరియు మచ్చ తెగుళ్లు ఆశించి నష్టం కలుగ జేయడానికి అవకాశం ఉంటుందన్నారు.అధిక వర్షాల వల్ల పంటలను ఎలా కాపాడు కోవాలో క్రింది సూచనలను రైతులు వెంటనే పాటించాలని కోరారు .1.. పంటలలో వర్షపు నీరు నిలబడినప్పుడు నీటిని కాలువ లాద్వారా పూర్తిగా తీసి వేయాలి.2.వర్షాలు ఆగిన తర్వాత మరియు పొలాలు ఆరిన తర్వాత ఎకరానికి యూరియా: 25 కేజీ లు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 25 కేజీ లు వేసుకోవాలి .3.పొటాషియం నైట్రేట్ (మల్టీ- కె) ఎకరానికి :2 కేజీలు, బోరాన్: 300 గ్రాములు, యురియా: 2 కేజీలు లేదా డై అమ్మోనియం ఫాస్ఫేట్: 2కేజీలు 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కలు బాగా తడిచే టట్లు పిచికారి చేసుకోవలెను. 4.అధిక వర్షాల వల్ల పంటలలో మొగ్గలు, పూత, కాయలు ఎక్కువగా రాలి పోతుంటే రైతులు వెంటనే ప్లానోఫిక్స్ (ఎన్.ఎ.ఎ 10 పి.పి.యం) ఎకరానికి 50 మి.లీ ను 225 లీటర్ల నీటిలో కలిపి మొక్కలంతా బాగా తడిచేటట్లు పిచికారి చేసుకోవలెను.5.వర్షాల వల్ల పంటలలో వేరు కుళ్ళు మరియు మొదలు కుళ్ళు నివారణకు గాను, ముందుగా మొదలు కుళ్ళు మరియు వేరుకుళ్ళ,ఆశించిన మొక్కలను తీసివేయవలెను.ఆ తర్వాత కాపర్ ఆక్సీ క్లోరైడ్ (బ్లైటాక్స్) ఎకరానికి 600 గ్రాములు లేదా కార్బన్ డిజమ్ 400 గ్రాములును లేదా డైతేన్-ఓ 45 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కల పాదుశ్రీబీ బాగా తడిచేటట్లు పిచికారి చేసుకోవలెను.6.ఆకుమచ్చ తెగుళ్ళు, నివారణకు గాను ఎకరానికి కార్బన్ డిజమ్(బావిస్టిన్) 200 గాములు లేదా ప్రోపి కొనజోల్ (టిల్ట్) 200 గ్రాములు లేదా హెక్సా కొనజోల్ (కాంటాప్): 400 గ్రాములు ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసు కొని ఆకు మచ్చ తెగుళ్ళు నివారణ చేసుకొని రైతులు అధిక వర్షాల వల్ల పంటలను కాపాడుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# బీసీ జనార్ధన్ రెడ్డికి మంత్రి పదవి రావడం ఎంతో హర్షించదగ్గ విషయం.. అడ్వకేట్ రఫీ



బనగానపల్లె శ్రీ ప్రస్థానం జూలై 20:నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణ వాస్తవ్యులు ఎస్.ఎం.డి.రఫీ, అడ్వకేట్ మొహర్రం పండుగ అనంతరం నెల్లూరు జిల్లాలో అత్యంత అంగరంగ వైభవంగా ఎంతో ప్రాముఖ్యత చెందిన నెల్లూరు రొట్టెల పండుగ కు బనగానపల్లె పట్టణ వాస్తవ్యులు ఎస్.ఎం.డి.రఫీ, అడ్వకేట్ ఆధ్వర్యంలో నెల్లూరు పట్టణంలోని బారాషహీద్ బాబా దర్గాలో మొక్కుబడి చెల్లించుకొన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో వైసిపి రాక్షసా పాలన పోవాలని స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం మళ్లీ టీడీపీ పార్టీ భారి మెజార్టీతో అధికారంలోకి రావాలని అలాగే బనగానపల్లి నియోజకవర్గం టిడిపి అభ్యర్థి బీ.సీ. జనార్దన్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిచి మంత్రి పదవి చేపట్టాలని గత సంవత్సరం మొక్కు కొనడం జరిగిందని తన కోరిక నెరవేరిందని, అందుకే మొక్కుబడిని ఈరోజు తీర్చుకోవడం చాలా ఆనందంగా ఉందని ఎస్.ఎం.డి రఫీ తెలిపారు. ఎస్.ఎం.డి రఫీ స్వర్ణాల చెరువులో రొట్టెను వదిలి బారా షహీద్ బాబా దర్గా లో 51 టెంకాయలు కొట్టి మొక్కుబడిని చెల్లించుకున్నారు. అనంతరం బారా షహీద్ బాబా దర్గా మొక్కు బడి చెల్లించుకున్న అడ్వకేట్ రఫీ బీసీ జనార్దన్ రెడ్డి స్వగృహం నందు బిసి ఇందిరమ్మ కి బారాషహీద్ బాబా ప్రసాదము అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు అన్వర్ సాహెబ్,మెహమూద్,మహబూబ్ బాషా, చాంద్ బాషా,ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు

## జనసేన సేన నాయకుని జన్మదిన సందర్భంగా పేద కుటుంబాలకు కిరాణా సరుకుల పంపిణి .

పవన్ కళ్యాణ్ మార్గంలోనే జనసైనికులు, సేవనే మార్గంగా ...



.శ్రీ ప్రస్థానం న్యూస్ కోవెలకుంట్ల : కోవెలకుంట్ల మండలం లోని స్థానిక పట్టణానికి చెందిన జనసేన నాయకుడు ఆనంద్ కిట్టు జన్మదినం సందర్భంగా జోళ్ళ దారసి గ్రామానికి చెందిన వృద్ధురాలు మరియు తల్లి తండ్రులు లేని ఇద్దరు బిడ్డలకు కిరాణా సరుకులు ఇవ్వడం జరిగింది. ముఖ్య అతిధిగా బనగానపల్లె జనసేన కోఆర్డినేటర్ పత్తి సురేష్ చేతులమీదుగా వితరణ చేయడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ సేవ స్ఫూర్తితో నే మాకు తోచిన సహాయం చేయడం జరిగిందన్నారు . వృద్ధురాలు మరియు తల్లి తండ్రులు లేని ఇద్దరు చిన్నారులు జనసేన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో గుర్రప్ప , నరసింహ , లింగమయ్య పాల్గొన్నారు

# నూతన కలెక్టర్ ను కలిసిన బిజెపి జిల్లా నాయకులు



కర్నూలు జిల్లాను వలస రహిత జిల్లాగా మార్చండి, జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లండి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణ, తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించాలని,కర్నూలు సచ్చివాలయం కర్నూలు జిల్లా నూతన కలెక్టర్‌పి.రంజిత్ బాషాను కర్నూలు జిల్లా బిజెపి అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ బృందం శనివారం కలెక్టరేట్లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి వివేకానందుడి పుస్తకాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలోని సమస్యలపై కలెక్టరు వివరించారు. పశ్చిమ ప్రాంతంలో ప్రధానంగా తాగు, సాగునీటి సమస్య ఉందని, జీవనోపాధికి ప్రతి సంవత్సరం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, ఈ రెండు సమస్యలపై దృష్టి సారి0చాలని కోరారు. పశ్చిమ ప్రాంత ప్రజానీకానికి ఉపాధి కల్పించి, వలసలు దివా రించి వారికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.కలెక్టర్ ను కలిసిన కర్నూలు జిల్లా అధ్యక్షుడు బిజెపి కునిగిరి నీలకంఠ, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి సాయి ప్రదీప్, ఉపేంద్ర నవీన్ కుమార్ తదితరులు




రాయలసీమ రక్షణన్యూస్. శ్రీశైలం ప్రతినిధి.20.07.2024 శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం రూ.1,11,111/-లను శ్రీ చుండి రఘుకుమార్, మల్కాజ్ గిరి, హైద్రాబాద్ వారు అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేయడం జరిగింది.

# కనకదుర్గ అమ్మవారికి శ్రీశైల దేవస్థానం తరపున సారే సమర్పణ.



విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా ఈ రోజు (20.07.2024) ఉదయం శ్రీశైల దేవస్థానం తరపున సారే సమర్పించడం జరిగింది. అదే విధంగా శ్రీ మల్లేశ్వర స్వామి వారికి కూడా పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది. ఈ మేరకు శ్రీశైల దేవస్థానం దేవస్థాన కార్యనిర్వహణ అధికారి శ్రీ డి పెద్దిరాజు దంపతులు అమ్మవారి ప్రధాన అర్చకులు పి. మార్కండేయ శాస్త్రి. ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి ఎం. హరిదాసు అర్చకులు వేద పండితులు పోలి పెద్ద వెంకట సుబ్రహ్మణ్యం సంబంధిత సిబ్బంది ఈసారెను సమర్పించారు. కాగా సారితో కనకదుర్గ అమ్మవారి ఆలయానికి చేరుకున్న వీరికి దుర్గా మల్లేశ్వర దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీ కె. ఎస్. రామారావు సంబంధిత అధికారులు అర్చకులు వేద పండితులు తదితరులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం తరపున అమ్మవారికి సారే స్వామివార్లకు వస్త్రాలు సమర్పించడం జరిగింది. తరువాత ఈ దేవస్థానం కార్యనిర్మాధికారి డి. పెద్దిరాజు దంపతులు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం వారు వేద ఆశీర్వచనం శేష వస్త్రాలు ప్రసాదాలు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. చివరిగా ఈ దేవస్థానం తరపున కూడా దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం వారికి శేష వస్త్రాలు ప్రసాదాలను కూడా అందజేయడం జరిగింది

# శ్రీవారిని దర్శించుకున్న హోం మంత్రి అనిత

తిరుమల,తిరుమల శ్రీవారిని హోంమంత్రి వంగలపూడి అనిత శనివారం దర్శించుకున్నారు. తరువాత ఆమె మీడియాతో మాట్లాడారు. శ్రీవారి దర్శనం చాలా బాగా జరిగింది. స్వామివారి ఆశీస్సులు నిండుగా కూటమి ప్రభుత్వంపై ఉండాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుమలలో భక్తులలో ఆనందంగా కనపడుతుంది. గతంలో కన్నా కొండపై సౌకర్యాలు బాగున్నాయని భక్తులు చెప్పుతున్నారని అన్నారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757